సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 16 । జనవరి । 2025



యువకుడు మృతి

సంక్రాంతి పండుగ రోజు ఆంథోనీ నగర్ సమీపంలో ఆగి ఉన్న కోళ్ల వ్యాన్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో **ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు.** 8లో ▸



మోతాదు మించితే అనర్థమే

దాళ్వా వరి సాగు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో రైతులు ఎరువుల వాడకంలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడులో నాలుగు రోజులపాటు జరిగిన జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ముగిశాయి. ఏలూరు, హైదరాబాద్ జట్లు విజేతలుగా నిలిచాయి. 8లో ▸

న్యూస్‌రీల్

క్షీరారామంలో కనుమ ఉత్సవం



పాలకొల్లులో స్వామివారి గ్రామోత్సవం

పాలకొల్లు అర్బన్: పంచారామ క్షేత్రం పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో కనుమ ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ గోశాలలో గోవులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ అర్చకస్వామి కృష్ణప్ప, దేవస్థానం సూపరింటెండెంట్ వాసు, అర్చకులు, ఆలయ సిబ్బంది సేవలందించారు.

రసవత్తరంగా చెడుగుడు పోటీలు



చెడుగుడు పోటీల్లో తలపడుతున్న జట్లు

ఆకివీడు: రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ప్రారంభమయ్యాయి. డీవైఎఫ్‌ఐ సంక్రాంతి పోటీల్లో భాగంగా చెడుగుడు పోటీలు, రెండు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గ్రామీణ క్రీడల్ని ప్రోత్సహించేందుకు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు 42 ఏళ్లుగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ తెలిపారు.

ముగిసిన పొట్టేలు పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న సినీ నటి అప్సరా రాణి

కైకలూరు: సంక్రాంతి సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి పొట్టేలు పోటీలు బుధవారం ముగిశాయి. మండవల్లి మండలం చావలిపాడు గ్రామంలో తలారి వెంకటస్వామి సోదరులు, తెలంగాణలో స్థిరపడిన ఈ ప్రాంత వాసి నీలపాల నరేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో భోగి రోజున ప్రారంభించి పోటీల్లో 150 పొట్టేళ్లు తలపడ్డాయి. తెలంగాణలోని బోయినపల్లికి చెందిన అబీద్ పొట్టేలు విజేతగా నిలిచి రూ.లక్ష నగదు బహుమతి గెలుచుకుంది. విజేతలకు సినీ నటి అప్సరా రాణి బహుమతులు అందించారు.

నేడు డీఆర్సీ సమావేశం

ఏలూరు (మెట్రో): జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్సీ) సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటల నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీ పాల్గొంటారు.

పందేలు మామూళ్లుగా లేవు

బరి తెగింపు

- జోరుగా కోడి పందేలు, గుండాట, పేకాటలు
- జిల్లాలో రూ.200 కోట్లకు పైగా నగదు చేతులు మారినట్టు అంచనా
- నిర్వాహకుల నుంచి ఎమ్మెల్యేలు, పోలీసులకు మామూళ్లు!
- బరికి రూ.30 వేల నుంచి రూ.5 లక్షల వరకు స్టేషన్ ముడుపులు
- బైండోవర్, పుంజుల స్వాధీనంతో తంతు పూర్తిచేయనున్న పోలీస్ యంత్రాంగం





తణుకు అర్బన్: జాతీయ రహదారి ప్రాంతంలో రాత్రిళ్లు పందేల వద్ద.. (ఇన్‌సెట్‌లో) **కాళ్ల:** తలపడుతున్న కోళ్లు

సాక్షి, భీమవరం: కోడి పందేలు నిర్వహించరాదన్న కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ పండుగ రోజుల్లో జిల్లా వ్యాప్తంగా పందేలు, పేకాట, గుండాటలు జోరుగా సాగాయి. సంప్రదాయం మాటున సాగిన ఈ జూద కార్యకలాపాలు పలువురు ఎమ్మెల్యేలు, పోలీసులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. పందెం బరిని బట్టి స్టేషన్ మామూళ్లుగా రూ.30 వేల నుంచి రూ.5 లక్షల వరకు నిర్వాహకులు ముట్టజెబుతున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారం మొత్తం తెరవెనుక గుట్టుచప్పుడుగా సాగుతోంది.

కూటమి నేతల కనుసన్నల్లో..

కూటమి నేతలు ఎక్కడికక్కడ బరులు ఏర్పాటుచేసి పందేలను నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 135 బరులు ఏర్పాటుచేయగా వీటిలో పెద్దవి 40 వరకు ఉండగా, మిగిలినవి చిన్నబరులు. గతంతో పోలిస్తే ఈ ఏడాది తాడేపల్లిగూడెం, ఆకివీడు, ఉండి, పాలకొల్లు, పెనుమంట్ర, అత్తిలి మండలాల్లో బరుల సంఖ్య పెరిగింది. కోడి పందేలు జరుగకుండా అడ్డుకోవాలని కోర్టు ఆదేశాలున్నా ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లతో పోలీసులు వాటి జోలికి పోకుండా సైలెంట్ అయిపోయారు.

యథేచ్ఛగా జూద క్రీడలు

ఏటా పోలీసుల నుంచి లైన్‌క్లియర్ అయినట్టు సమాచారం వచ్చాక భోగి రోజు మధ్యాహ్నం లేదా సాయంత్రం నుంచి పందేలను మొదలుపెట్టేవారు. కాగా కూటమి పాలనలో ఈ ఏడాది పండగకు రెండు నెలల ముందు నుంచే జిల్లాలో పందేల జాతర మొదలైంది. కొందరు ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో వారంలో రెండు మూడుచోట్ల రాత్రివేళల్లో కోడిపందేలు యథేచ్ఛగా సాగిపోయాయి. భోగి రోజున ఉదయం నుంచే బరుల వద్ద కోడి పందేలు, పేకాట, గుండాటలను మొదలు పెట్టేశారు.

మామూళ్ల షురూ : పందేల నిర్వహణకు సహకరించినందుకు పలువురు ఎమ్మెల్యేలు, పోలీసులకు బరుల నిర్వాహకులు ముడుపులు ముట్టచెప్పే పనిలో ఉన్నారు. కోడి పందేల కోసం పోలీసులకు, నిర్వాహకులకు మధ్యవర్తిత్వం నెరిపిన కూటమి నేతలే ఈ మామూళ్ల సంగతి చూసుకుంటున్నారు. కొందరు ఎమ్మెల్యేలకు పెద్ద బరుల నుంచి రూ.10 లక్షల వరకు అందజేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. చిన్నాపెద్దా తేడా లేకుండా అన్ని బరుల నుంచి స్టేషన్ మామూళ్ల రాబట్టే పనిలో ఉన్నారు. పందేలు, పేకాట, గుండాట తదితర జూద కార్యకలాపాల ద్వారా ఈ మూడు రోజులు జిల్లాలోని ఏఏ బరుల వద్ద ఎంత మొత్తంలో నగదు చేతులు మారింది ఇప్పటికే పోలీసుల వద్ద పక్కా సమాచారం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసుల సంక్షేమ నిధి పేరిట చిన్నా పెద్ద బరుల వద్ద రూ.30 వేల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. భీమవరం పరిసరాల్లో ఏర్పాటుచేసిన నాలుగు పెద్ద బరుల వద్ద ఈ మామూళ్ల మొత్తం మరింత అధికంగా ఉంటుందంటున్నారు. జిల్లాలో జోరుగా కోడిపందేలు జరిగినట్టు మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో వాటిని అడ్డుకున్నట్టుగా కోర్టుకు చూపించే నిమిత్తం కొందరు వ్యక్తులు, పుంజులను అప్పగించాలని ఇప్పటికే పోలీసుల నుంచి నిర్వాహకులకు కబురు పంపినట్టు తెలుస్తోంది.

గూడెంలో రూ.1.25 కోట్ల పందెం

భీమవరం పరిసరాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నాలుగు పెద్ద బరుల వద్ద ఒక్కో పందె రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు జరిగితే, ఓ మాదిరి బరుల వద్ద రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు, చిన్న బరుల వద్ద రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు పందేలు జరిగాయి. తాడేపల్లిగూడెంలోని ఓ బరి వద్ద బుధవారం రూ.1.25 కోట్ల పందెం జరిగింది. ఇవి కాకుండా పైపందేలు రూ.కోట్లల్లో జరిగాయి. జిల్లావ్యాప్తంగా మూడు రోజుల్లో బరుల వద్ద రూ.200 కోట్ల మేర నగదు చేతులు మారినట్టు అంచనా.

10 శాతం వరకూ కమీషన్‌గా..

ఒక్కో బరిలో రోజుకు 30 నుంచి 40 వరకు పందేలు జరిగాయి. పందెంపై 2 నుంచి 10 శాతం వరకు నిర్వాహకులు కమీషన్‌గా తీసుకున్నారు. బరుల వద్ద గుండాట, పేకాట, కేసినో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను బరుల నిర్వహణలో ఆరితేరిన వారికి కాంట్రాక్టుకు ఇచ్చేశారు. మద్యం స్టాళ్లను ఏర్పాటుచేసి విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేయించారు. వీటన్నంటిపై రూ.10 లక్షల నుంచి రూ.కోటికి పైగా నిర్వాహకులు వసూలు చేసినట్టు తెలుస్తోంది.



ఉండి: బరి వద్ద చేతులు మారుతున్న నగదు



భీమవరం: భీమవరంలో మద్యం స్టాల్



మొగల్తూరు: బరుల వద్ద గుండాట



తణుకు అర్బన్: తేతలిలో పందేలకు రెడీ అంటున్న పుంజులు



తాడేపల్లిగూడెం: పందేల బరుల వద్ద మహిళా బౌన్సర్లు



నరసాపురం: పందేల శిబిరాల వద్ద మోటార్ సైకిళ్లు



పెంటపాడు: మండలంలో జోరుగా పందేలు



కాళ్ల: మండలంలో జూద క్రీడలు



నరసాపురం రూరల్: ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు



పాలకోడేరు: శృంగవృక్షంలో గుండాట

జాతీయస్థాయి కబడ్డీ పోటీలు



జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం రుస్తుంబాదలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏటా మాదిరిగా జాతీయస్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారభమయ్యాయి. మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, డీఎస్పీ శ్రీవేదతో కలిసి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మాట్లాడుతూ 32 ఏళ్లుగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్ మాట్లాడుతూ ఏటా పోటీల నిర్వహణకు సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్డీఓ రాజు, డీఎస్పీ శ్రీవేద మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల నిర్వహణ అభినందనీయమన్నారు. ఐదు రోజులపాటు జరిగే టోర్నమెంట్‌లో పలు రాష్ట్రాల నుంచి 20 జట్లు పాల్గొంటున్నాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రిళ్లు కూడా మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు.

● కొత్త అల్లుడికి అదిరే ఆతిథ్యం



జంగారెడ్డిగూడెం : గోదారోళ్ల ప్రేమాభిమానులకు ప్రత్యేకత ఉంది. ఆతిథ్యంలో వీరికి వీరే సాటి. సంక్రాంతి కొత్త అల్లుడికి 452 రకాల వంటకాలతో అదిరే ఆతిథ్యం ఏర్పాటుచేసి ఔరా అనిపించారు. జంగారెడ్డిగూడేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వందనపు వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ దంపతుల కుమార్తె ప్రియాంకకు కొయ్యలగూడేనికి చెందిన కొల్లూరు శివభాస్కర్‌కు ఇచ్చి గతేడాది వివాహం చేశారు. ఇది తొలి సంక్రాంతి కావడంతో అల్లుడికి ఇలా భారీ విందు ఏర్పాటుచేశారు. పిండి వంటలు, రైస్ వంటలు, కూరలు, పచ్చళ్లు, పొడులు, పండ్లు, సూప్స్, బిర్యానీలు, సేమియా ఐటమ్స్, స్వీట్లు వంటివి విందులో ఉంచారు. విందు భోజనాన్ని తిలకించేందుకు బంధువులు, మిత్రులు తరలివచ్చారు.

శ్రీవారి వైభవం కనుమా..

నేత్రపర్వంగా చిన వెంకన్న కనుమ ఉత్సవం





దొరసానిపాడులో దేదీప్యమానంగా వెలుగొందుతున్న కనుమ మండప ప్రాంతం, స్వామివారికి పూలు, పండ్లు సమర్పిస్తున్న ఇన్‌చార్జి ఈఓ త్రినాథరావు దంపతులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న పార్వేటి (కనుమ) ఉత్సవం బుధవారం అట్టహాసంగా జరిగింది. ఉత్సవం నిమిత్తం దొరసానిపాడు గ్రామానికి తరలివెళ్లిన స్వామిని వీక్షించిన భక్తులు పరవశించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ దొరసానిపాడులో సంబరంలా వేడుక నిర్వహించారు. ముందుగా మధ్యాహ్నం శ్రీవారి ఆలయంలో ఉభయ దేవేరులతో స్వామివారి ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంలో ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా పురవీధులకు పయనమైంది. తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు కొండ వెనుక భాగాన ఉన్న దొరసానిపాడు గ్రామానికి కనుమ ఉత్సవం నిమిత్తం వెళ్లారు. గ్రామంలో మహిళలు దారి పొడవునా రంగవల్లులను తీర్చిదిద్ది, పూలతో ఘన స్వాగతం పలికారు. దొరసానిపాడు పురవీధుల్లో తిరుగాడిన అనంతరం స్వామివారు కనుమ మండపం వద్దకు చేరుకుని భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత శ్రీవారు, అమ్మవార్లను మండపంలో ఉంచి అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు వేడుకలో పాల్గొన్నారు. ఉత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆ తర్వాత శ్రీవారు, అమ్మవార్లు గిరి ప్రదక్షిణగా తిరిగి ద్వారకాతిరుమలలో ఆలయానికి చేరుకున్నారు.



కనుమ మండపానికి తరలివెళుతున్న స్వామి, అమ్మవార్లు



కనుమ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



ఊరేగింపులో వేంకటేశ్వర స్వామివారి నాటక ప్రదర్శన

క్లుప్తంగా

మిసెస్ ఇండియా ఏపీగా వైద్యురాలు రాజ్యలక్ష్మి


వైద్యురాలు రాజ్యలక్ష్మి

నూజివీడు: పట్టణంలోని జనతా హాస్పటల్స్ వైద్యురాలు డాక్టర్ యక్కల రాజ్యలక్ష్మి క్లాసిక్ కేటగిరిలో మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌గా ఎంపికయ్యారు. ఈనెల 12న శంషాబాద్‌లోని సీటాడెల్ హోటల్ అండ్ కన్వెన్షన్‌లో నిర్వహించిన మిసెస్ ఇండియా తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్–2025 గ్రాండ్ ఫినాలేలో రాజ్యలక్ష్మి మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌గా ఎంపికై గోల్డ్ మెడల్‌ను సాధించారు. 40 సంవత్సరాలు వయస్సు పైబడిన మహిళలకు ఈ పోటీలు నిర్వహించగా దీనిలో 60 మంది వివాహితులు పాల్గొన్నారు. వీరందరిలో క్లాసిక్ కేటగిరిలో రాజ్యలక్ష్మి విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ గీతా నాగశ్రీ, మిసెస్ ఇండియా జాతీయ డైరెక్టర్ దీపాలీ ఫడ్నీస్ గౌరవ అతిథులుగా పాల్గొనగా, న్యాయ నిర్ణేతల ప్యానెల్‌లో వైద్యం, కార్పొరేట్ వ్యూహం, ఫ్యాషన్, కళారంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. మమతా త్రివేది శ్రీమతి ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ప్రాంతీయ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. 2018 నుంచి ఆమె ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌గా ఎంపికైన డాక్టర్ రాజ్యలక్ష్మిని పలువురు అభినందించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.3.21 లక్షల విరాళం


శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం అందించిన దాత వెంకటేశ్వరరావు కుటుంబం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముగ్గురు భక్తులు వేర్వేరుగా బుధవారం రూ.3,21,348 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా కాగుపాడుకు చెందిన కడియాల వెంకటేశ్వరరావు రూ.1,11,116, ఏలూరుకు చెందిన కొండపనేని సాంబశివరావు రూ.1,10,116, రాజమండ్రికి చెందిన ద్వారంపూడి వెంకటరెడ్డి రూ. 1,00,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాలను అందించారు.

శ్రీపర్రులో ఘర్షణ

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రులో నిర్వహించిన పేకాట శిబిరం వద్ద ఘర్షణ జరిగింది. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని స్థానిక టీడీపీ నాయకులు శ్రీపర్రులో పేకాట శిబిరం నిర్వహించారు. ఇష్టారాజ్యంగా పేకాట నడిపిస్తున్నారంటూ మానూరుకు చెందిన పలువురు వ్యక్తులు ఆరోపించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదం చినికి చినికి గాలివానలా మారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. శ్రీపర్రు గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తలపై గాయం కావడంతో ఆసుపత్రికి తరలించారు. మానూరు గ్రామస్తుడు బీర్ బాటిల్‌తో తలపై కొట్టాడని స్థానికులు ఆరోపించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో రహదారిపై చేరడంతో ట్రాఫిక్ స్తంభించింది. కొట్లాట జరుగుతుందని సాయంత్రం 4 గంటలకు ఫోన్ చేస్తే రాత్రి 7.30 నిమిషాలకు పోలీసులు వచ్చారని స్థానికులు చెబుతున్నారు. మూడురోజులుగా గ్రామ కూడలిలో రాత్రి, పగలు పేకాట ఆడుతున్నప్పటికీ పోలీసులు పట్టించుకోలేదంటూ మహిళలు ఆరోపిస్తున్నారు.

మోతాదు మించితే అనర్థమే

- 2.25 లక్షల ఎకరాల్లో దాళ్వా వరినాట్లు లక్ష్యం
- ఇప్పటికే 50 శాతం పూర్తయిన వరినాట్లు
- ఎరువులను మితంగా వాడడమే మేలంటున్న వ్యవసాయాధికారులు


పంజా వేమవరం గ్రామంలో దాళ్వా వరిపైరుకు ఎరువులు వేస్తున్న దృశ్యం

భీమవరం: దాళ్వా వరిసాగు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ముందుగా నాట్లువేసిన రైతులు ఎరువులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 2.25 లక్షల ఎకరాల్లో దాళ్వా వరినాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు దాదాపు 50 శాతానికి పైగా నాట్లు పూర్తయినట్లు అంచనా. పంటల దిగుబడిని పెంచడంలో ఎరువుల పాత్ర చాలా కీలకమైంది. అయితే రైతులకు రసాయన ఎరువుల వినియోగంపై పూర్తి అవగాహన లేకపోవడం, పరిసర ప్రాంత రైతుల మధ్య నెలకొన్న పోటీతత్వం కారణంగా అవసరానికి మించి విచక్షణా రహితంగా ఎరువులు వాడుతున్నారు. దీనితో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగి పోవడంతోపాటు చీడపీడల విజృంభించి జింక్, ఇనుము వంటి సూక్ష్మపోషక లోపాలు ఎక్కువ కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

పరిమితంగా వాడితేనే మంచిది

ఎకరం విస్తీర్ణంలో వరికి మొదటి దఫా సిఫారసు చేసిన మొత్తం భాస్వరాన్ని దమ్ములో వేసుకోవడం వల్ల త్వరగా మూన తిరిగి దుబ్బు ఎక్కువగా చేస్తుంది. నత్రజని ఎరువును మూడు సమభాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలోనూ, రెండో దఫా పిలకలు కట్టే దశలోనూ, చివరి దఫా అంకురం దశలోనూ వేసుకోవాలి. పొటాష్ ఎరువును రెండు భాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలో మిగిలిన సగం అంకురం ఏర్పడే దశలోనూ వేసుకోవాలి. సూటి ఎరువుల రూపంలో ఎకరాకు 157 కిలోల యూరియా, 200 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరమవుతాయి.

నత్రజని ఎరువు వాడకం ఇలా..

నత్రజని ఎరువు సమర్థవంతంగా పనిచేయాలంటే చేనులో బురద పదునుపై చల్లి 48 గంటల తరువాత నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి లేదా 250 కిలోల తేమ కలిగిన మట్టి కలిపి 2 రోజులు నిల్వ ఉంచిన తరువాత పొలంలో చల్లుకోవడం వల్ల మొక్క ధృడంగా పెరుగుతుంది.

పైరులో సూక్ష్మ పోషక లోపాలు

ప్రధానంగా జింక్ లోపంవల్ల నాట్లు వేసిన తరువాత మొక్క పైనుంచి 3 లేదా 4 ఆకుల మధ్య ఈనె తెల్లగా పాలిపోతుంది. మధ్య ఈనె ముందుగా ఆకుపచ్చ నుంచి పసుపు రంగుకు, తరువాత తెలుపు రంగుకు మారుతుంది. జింక్ లోపం ఆశించిన ఆకులు చిన్నవిగా, పెలుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. జింక్ లోపం నివారణకు నాట్లు వేసిన 2–5 వారాల మధ్య పొలంలో ఉన్న నీటిని తీసివేసి కొత్త నీటిని పెట్టాలి. తరువాత లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పైరు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి. ఐదు రోజుల వ్యవధిలో రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేయడం వల్ల లోపాన్ని పూర్తిగా నివారించవచ్చును.

ఇనుప ధాతు లోపం

ఇనుప ధాతు లోపం సాధారణంగా సున్నం ఎక్కువగా ఉండే నేలల్లోనూ, మెట్ట నారుమడులు వేసే ప్రాంతాలు, అధిక వర్షాలు కురిసిన తరువాత నీరు నిలిచిన పొలాల్లోనూ ఎక్కువగా కనిపిస్తుంది. ముందుగా లేత ఆకుల ఈనెల మధ్య భాగం పసుపు రంగుకు మారి క్రమేపీ ఆకు అంతా తెల్లగా మారి ఎండిపోతుంది. దీని నివారణకు లీటరు నీటికి 20 గ్రాముల అన్నభేది, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి రెండు, మూడు పర్యాయాలు పిచికారీ చేయాలి.

“ ఎరువులు అతిగా వాడితే నష్టమే



దాళ్వా పంటలో రైతులు ఎక్కువ దిగుబడి సాధించాలని ఎరువులను ఎక్కువగా వినియోగించడం వల్ల ఫలితం కంటే నష్టమే ఎక్కువ. ఎరువులు అధిక వినియోగం వల్ల ఖర్చు పెరగడమేగాక చీడ, పీడలు ఆశించి దిగుబడులు తగ్గేపోయే ప్రమాదముంది. వ్యవసాయశాఖాధికారుల సూచనల ప్రకారం ఎరువులు వినియోగించాలి.

– డాక్టర్ ఎంవి కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం మార్టేరు

కొమ్ముగూడెంలో ఎక్సైజ్ తనిఖీలు


బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్: కొమ్ముగూడెంలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 8 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు దొరబాబు, మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

130 కేసుల నమోదు

భీమవరం: సంక్రాంతి సందర్భంగా మూడు రోజులుగా సాగుతున్న కోడిపందేలు, జూదాలు బుధవారం రాత్రి ముగిశాయి. కోడి పందేలపై ఉక్కుపాదం మోపుతామని, ఎక్కడా పందాలు జరగనిచ్చేది లేదంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసిన పోలీసు అధికారులు సోమవారం నుంచి జిల్లావ్యాప్తంగా విచ్చలవిడిగా కోడి పందేలు, జూదాలు, మద్యం విక్రయాలు, డ్యాన్స్ ప్రోగ్రామ్స్ నిర్వహించినా చేష్టలుడిగి చూస్తుండిపోయారు. అయితే బుధవారం సంక్రాంతి సంబరాలు పూర్తికావడంతో సాయంత్రం నుంచి కోడి పందేల బరుల వద్దకు పోలీసులు పరుగులు తీసి పందేలను నిలుపుదల చేయించారు. భీమవరం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 130 కేసులు నమోదుచేసినట్లు డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య చెప్పారు.

బాస్కెట్‌బాల్ విజేతలు ఏలూరు, హైదరాబాద్



పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన లయోలా హైదరాబాద్ జట్టుకు షీల్డును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



మహిళల విభాగంలో విజేతగా నిలిచిన ఏలూరు జట్టుకు షీల్డును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

- ముగిసిన బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు
- విజేతలకు షీల్డులు అందించిన మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్

నూజివీడు: స్థానిక డీఏఆర్ కళాశాలలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ రాజా వెంకటాద్రి అప్పారావు బహదూర్ 48వ స్మారక పురుషుల, మహిళల జాతీయ బాస్కెట్ బాల్ పోటీల్లో పురుషుల విభాగంలో హైదరాబాద్ లయోలా జట్టు, మహిళల విభాగంలో ఏలూరు జట్టు విజేతలుగా నిలిచాయి. ఏలూరు జట్టు విన్నర్‌గా నిలవడం వరుసగా ఇది రెండోసారి కావడం గమనార్హం. పురుషుల, మహిళల సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లతో పాటు రెండు విభాగాలలో 3, 4 స్థానాలకు మంగళవారం పోటీలు నిర్వహించారు. సెమీఫైనల్ పోటీల్లో భాగంగా మహిళల విభాగంలో తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో ఏలూరు జట్టు, సెయింట్ ఫ్రాన్సిస్ హైదరాబాద్‌పై 33–25 స్కోర్ తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో డీఎస్ఏ పల్నాడు జట్టు నూజివీడు వీటీహెచ్‌పై 47–40 స్కోర్‌తో గెలుపొంది ఫైనల్‌లోకి ప్రవేశించింది. మూడో స్థానంలో సెయింట్ ఫ్రాన్సిస్ హైదరాబాద్ జట్టు, నాల్గో స్థానంలో వీటీహెచ్ నూజివీడు నిలిచాయి. పురుషుల విభాగంలో తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో స్వస్తిక్ హైదరాబాద్ జట్టు ఏపీ పోలీస్ జట్టుపై 57–53స్కోర్‌తో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో లయోలా హైదరాబాద్ జట్టు, హెచ్ ఫౌండేషన్ గుంటూరుపై 56–49 తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది. ఏపీ పోలీస్ జట్టు మూడో స్థానంలోను, హెచ్ ఫౌండేషన్ జట్టు నాల్గో స్థానంలో నిలిచాయి.

హోరాహోరీగా పురుషుల ఫైనల్ మ్యాచ్

పురుషుల ఫైనల్ మ్యాచ్ లయోలా, స్వస్తిక్ జట్ల మధ్య ఆద్యంతం హోరాహోరీగా సాగింది. ఇరు జట్ల మధ్య విజయం నువ్వానేనా అన్నట్లుగా దోబూచులాడింది. ఆట చివరి క్షణం వరకు విజయం ఎవరిని వరిస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇరుజట్ల క్రీడాకారులు ఒకరి మించి ఒకరు ప్రతిభను కనబరుస్తూ తమ జట్లకు పాయింట్లు తీసుకువచ్చారు. ఆఖరి అర నిమషంలో లయోలా జట్టు మూడు పాయింట్లు తెచ్చుకొని 60–57 స్కోర్‌తో స్వస్తిక్ జట్టుపై గెలుపొంది విజేతగా నిలిచింది. మహిళల ఫైనల్ మ్యాచ్‌లో ప్రారంభం నుంచి ఏలూరు జట్టు పల్నాడు జట్టుపై పూర్తి ఆధిక్యత కనబరిచింది. ఏ దశలోనూ ఏలూరు జట్టుకు పోటీ ఇవ్వలేకపోవడంతో మ్యాచ్ ఏకపక్షంగా కొనసాగింది. దీంతో ఏలూరు జట్టు 49–19 తేడాతో పల్నాడు జట్టుపై విజయం సాధించింది.

నూజివీడుకే గర్వకారణం

48 ఏళ్లుగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించడం నూజివీడుకే గర్వకారణమని మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. బాస్కెట్‌బాల్ పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు కృషి, పట్టుదలతో ఆడి తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు. క్రీడల్లో ప్రావీణ్యత ప్రదర్శించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఆర్ కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు ఎంఎంఆర్‌వీ అప్పారావు, నూజివీడు సీడ్స్ డైరెక్టర్ మండవ ఆశాప్రియ, హాటెక్ కంట్రోల్స్ ఎండీ సీహెచ్‌ఎల్ రమేష్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పసుపులేటి సాధన తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారికి రూ.కోటి జీఎస్టీ జరిమానా

ముదినేపల్లి రూరల్: చిరువ్యాపారికి జీఎస్టీ రూ.కోటి చెల్లించాలని నోటీసు వచ్చిన వైనమిది. మండలంలోని శ్రీహరిపురంనకు చెందిన పంచకర్ల విజయబాబు కూల్‌డ్రింక్‌ల వ్యాపారం చేస్తుంటాడు. ఇందుకు సంబంధించి జీఎస్టీ నంబరు కోసం గతేడాది మార్చి 23న విజయవాడలోని ఏసీటీవో కార్యాలయంలో సిబ్బందిని సంప్రందించారు. కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న బిల్లా కిరణ్ జీఎస్టీ నంబరు కోసం ఆధార్, పాన్ కార్డు, ఫొటో అందించాలని విజయబాబును కోరాడు. ఈమేరకు తన ఆధారాలను కిరణ్‌కు పంపించారు. ప్రతినెలా విజయ్‌బాబు వ్యాపారానికి సంబంధించి కొనుగోళ్లు, అమ్మకాల లావాదేవీలను ఫోన్‌లో తెలిపేవారు. ఈమేరకు రిటర్న్‌లు కిరణ్ దాఖలు చేసేవాడు. ఈనేపథ్యంలో గత ఆగస్టు 3న సేల్స్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ విజయ్‌భాస్కర్ సిబ్బందితో సింగరాయపాలెం వచ్చి విజయబాబు దుకాణాన్ని తనిఖీ చేశారు. విజయ్‌బాబుకు కేటాయించిన జీఎస్టీ నంబరుపై రూ.66,65,76,256 లావాదేవీలు జరిగాయని వీటిపై రూ.కోటి వరకు పన్ను చెల్లించాలని నోటీసు జారీ చేశారు. ఇంత పెద్ద మొత్తంలో లావాదేవీలు తాను చేయలేదని విజయ్‌బాబు తెలుపగా స్థానిక సచివాలయ ఉద్యోగులతో పంచనామా నిర్వహించారు. తనకు విధించిన పన్నుపై విజయ్‌బాబు గత నవంబరు 25న అకౌంటెంట్ కిరణ్‌ను నిలదీయగా తనవల్ల తప్పు జరిగిందని ఒప్పుకుని తానే పన్ను చెల్లిస్తానని తెలిపాడు. అప్పటినుంచి ఇప్పటివరకు పన్ను చెల్లించకుండా కిరణ్ తనను మోసం చేశాడంటూ విజయ్‌బాబు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సై వీరభద్రరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇక సెలవు.. వెళ్లొస్తాం


స్వగ్రామానికి పయనమైన గంగిరెద్దు బృందం సభ్యులు

ఇంటిముఖం పట్టిన సంక్రాంతి అతిథులు

గణపవరం: నెల రోజులుగా గ్రామాల్లో సందడి చేసిన సంక్రాంతి అతిథులు క్రమంగా ఇంటిముఖం పడుతున్నారు. ఏటా సంక్రాంతికి ప్రత్యేకంగా దర్శనమిచ్చే హరిదాసులు, జంగమ దేవరలు, గంగిరెద్దుల వాళ్లు, బుడబుక్కల వారు, పిట్టల దొరలు సంక్రాంతి పండుగ ముగియడంతో వారి స్వగ్రామాలకు బయలుదేరుతున్నారు. ఇతర జిల్లాల నుంచి, జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి గ్రామాలకు వచ్చి సంక్రాంతి నెల ప్రారంభం నుంచి పండుగ ముగిసేవరకూ ఆయా గ్రామాల్లో తిరుగుతూ వారు సంక్రాంతి పండుగకు సరికొత్త కళను తీసుకువస్తుంటారు. ప్రస్తుతం సంక్రాంతి పండగ ముగియడంతో వీరంతా స్వగ్రామాలకు తరలిపోతున్నారు. బుధవారం కనుమరోజున కొందరు స్వగ్రామాలకు బయల్దేరగా, గురువారం ముక్కనుమ రోజున మరికొందరు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఈనెలరోజులూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బియ్యం, నగదు బహుమతులు అందుకున్నారు. వీటితో తమ స్వగ్రామాలకు వెళ్లి అక్కడ చిరువ్యాపారాలు, కూలి పనులు చేసుకుంటామని, మళ్లీ సంక్రాంతి నెల ప్రారంభంలో ఇక్కడికి వస్తామని కృష్ణాజిల్లాకు చెందిన గంగిరెద్దుల బృందం నాయకులు సోమానాయక్ తెలిపారు.

ప్రమాదవశాత్తూ కాలువలో పడి తాపీ మేస్త్రి మృతి

పాలకొల్లు అర్బన్: ప్రమాదవశాత్తూ కాలు జారి పంట కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని సలాధివారితోటకు చెందిన కె అచ్యుతరామారావు (36) తాపీపని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి టాక్సీస్టాండ్ వెనుక ఉన్న దిగమర్రు పంట కాలువలోకి కాళ్లు కడుక్కోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ కాలు జారి పంటకాలువలో పడిపోయాడు. బుధవారం ఉదయం పంటకాలువలో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు చూసి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు అచ్యుతరామారావుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని తండ్రి త్రిమూర్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై పృథ్వీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైయినేజీలో పడి వ్యక్తి మృతి


నండూరి ప్రసాద్ మృతదేహం

కామవరపుకోట: డ్రైయినేజీలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలివి. స్థానిక కొత్తూరు బత్రాజు కాలనీ చెందిన నండూరి ప్రసాద్ (48) గ్రామంలో వ్యవసాయ కూలీగా పని చేస్తుంటాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అతను బుధవారం మధ్యాహ్నం స్థానిక అంబికా వైన్స్ ఆనుకుని ఉన్న డ్రైయినేజీ నీటిలో శవమై కనిపించినట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తడికలపూడి ఎస్సై చెన్నారావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. కాగా తన భర్త మృతి చెందడానికి అంబికా వైన్స్ యాజమాన్యం, ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని నండూరి ప్రసాద్ భార్య జ్యోతి ఆరోపించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచ్చలవిడిగా మద్యం లభిస్తుండడంతో తన భర్త మద్యం తాగి డ్రైయినేజీలో పడి మృతి చెందాడని జ్యోతి కన్నీటిపర్యంతమైంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న ఎస్సై కుటుంబరావు

చింతలపూడి: సంక్రాంతి పండగ పూట మండలంలో విషాదం చోటుచేసుకుంది. చింతలపూడి మండలం, ఆంథోనీ నగర్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కోళ్ళఫారం సమీపంలో ఆగి ఉన్న కోళ్లవ్యాన్‌ను ద్విచక్ర వాహనంపై వస్తున్న తిమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వెనుక నుంచి ఢీకొట్టారు. గ్రామస్తుల సమాచారం అందుకున్న ఎస్సై కుటుంబరావు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ఇ భరత్ కుమార్(28)కి తీవ్ర గాయాలవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల బరిలో ఘర్షణ


చెక్‌పోస్ట్ సెంటర్లో నిరసనకారులకు నచ్చచెబుతున్న డీఎస్పీ రవిచంద్ర

కామవరపుకోట: సంక్రాంతి కోడిపందాల బరిలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. స్థానిక కొత్తూరు మారుతి నగర్ సమీపంలో మంగళవారం రాత్రి కోడిపందేల బరిలో కొండగూడెం గ్రామానికి చెందిన కొందరు యువకులు, ద్వారకాతిరుమల మండలానికి చెందిన కొందరు యువకుల మధ్య జరిగిన ఘర్షణ దాడికి దారి తీసింది. దీంతో కొందరు యువకులు గాయాలపాలవడంతో ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తడికలపూడి ఎస్సై చెన్నారావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టి గొడవను అదుపులోకి తెచ్చారు. అయితే కొండగూడెం యువకులు మాత్రం ద్వారకాతిరుమల అగ్రకులానికి చెందినవారు కులం పేరుతో దూషించి తమపై దాడి చేశారని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అదే రాత్రి చెక్ పోస్ట్ సెంటర్లో ధర్నాకు దిగారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో డీఎస్పీ రవిచంద్ర ఘటనా స్థలికి చేరుకుని నిరసనకారులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కాగా బుధవారం ఆ బరిలో మాత్రం కోడిపందేలను నిలుపుదల చేశారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయి పోటీలకు బయలుదేరి వెళ్లిన రాష్ట్ర జట్టు

నూజివీడు: పట్టణంలోని వీటీహెచ్ గ్రౌండ్‌లో శిక్షణ పొందుతున్న బాస్కెట్‌బాల్ క్రీడాకారులు జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టు తరుపున ఎంపికైనట్లు కోచ్ వాకా నాగరాజు తెలిపారు. షేక్ ఆస్రా, బీ ప్రణవి, బీ స్నేహలతదుర్గ ఎంపికవ్వగా, వీరు ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు చెన్నైలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. వీరిలో షేక్ ఆస్రా రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. గతేడాది నవంబరు లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర వహించిన ఈ ముగ్గురిని రాష్ట్ర జట్టులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర జట్టుకు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ పీడీ ఎస్ లక్ష్మీ పీడీగా వ్యవహరిస్తున్నారు.

లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ మృతి


ఘటనా స్థలంలో సోమరాజు మృతదేహం

పాలకోడేరు: పండుగ వేళ ఓ వ్యక్తిని మృత్యువు లారీ రూపంలో కబళించింది. కొమ్ముచిక్కాల గ్రామానికి చెందిన కుచ్చేర్లపాటి సోమరాజు (64) బుధవారం ఉదయం టీవీఎస్ మోపెడ్‌పై భీమవరం వెళ్లి తిరిగి వస్తుండగా, విస్సాకోడేరు కనకదుర్గ గుడి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న సోమరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. బావ గొట్టుముక్కల ప్రసాదరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకోడేరు ఏఎస్సై వీఎస్ఎస్ఎన్ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడి పందేలు, పేకాట, గుండాటలు యథేచ్ఛగా సాగాయి. తూర్ల లక్ష్మీపురం, దొరసానిపాడు, తిమ్మాపురం, గుణ్ణంపల్లి, వెంకటకృష్ణాపురం, ఎం.నాగులపల్లి, ద్వారకాతిరుమల, పంగిడిగూడెం, మలసానికుంట, తిరుమలంపాలెం, పి.కన్నాపురం గ్రామాల్లో జరిగిన కోడి పందేల స్థావరాలపై దాడులు చేసి 12 కేసులు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. అందులో భాగంగా 37 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.14,580 నగదు, 12 కోడి పుంజులు, 24 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అదేవిధంగా 6 పేకాట కేసులు నమోదు చేసి, 15 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.7,210 స్వాధీనం చేసుకున్నామన్నారు. గుండాట ఫ్లెక్సీలు 6, డైస్ 12 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా ఉరుసు మహోత్సవాలు



జగన్నాథపురం గ్రామంలో దర్గాను అలంకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని హజరత్ కాలే మస్తాన్ షా ఔలియా దర్గాలో మంగళ, బుధవారాల్లో 108వ ఉరుసు మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఘుమ్మస్‌పై గంధం పూసే కార్యక్రమం, బుధవారం ఊరేగింపు జరిగాయి. దర్గా పోషకులు అబ్బిన నాగమణి, వారి కుమారుడు రాజీవ్ చౌదరి ఆధ్వర్యంలో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం దీపాల మహోత్సవం నిర్వహించి, విద్యలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉత్సవాల్లో ప్రజలు పాల్గొన్నారు.

ఉప్పరగూడెంలో చెడుగుడు పోటీలు



ఉప్పరగూడెం గ్రామంలో చెడుగుడు పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలుత గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దండే గోతియ్య పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సాంప్రదాయం ముసుగులో జరిగే జూదక్రీడలను నిలువరించేందుకు ఏటా చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీఒక్కరూ విద్యతో పాటు క్రీడల వైపు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండే కనకబాబు, అంబేడ్కర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం :లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. డైమండ్స్ క్లబ్ వారిచే బుధవారం పట్టణంలోని పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, కాళ్ళ గోపికృష్ణ, జొన్నల సతీష్ కుమార్, నార్ని వెంకట కృష్ణారావు, అడపా గిరిబాబు, మానేపల్లి సునీల్ కుమార్, యాదల శివాజీ, పూతినీడి శివరామకృష్ణ, మహ్మద్ అహ్మద్, మరడాని పరుశురామ్, విష్ణు, రాజు, సాయి సత్యనారాయణరాజు, ఉపేంద్ర పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం



పాలూరు గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అత్తిలి: పాలూరు గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.రాత్రి ఆసాదుల గరగనృత్యాలు, మేళతాళాలతో అమ్మవారి సేవ కార్యక్రమం, గురువారం జాతర మహోత్సవం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ముత్యాలమ్మ అమ్మవారిని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో బెల్ట్‌షాపు నిర్వాహకుడు అరెస్టు



బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

పెంటపాడు: సంక్రాంతి సందర్భంగా అక్రమంగా ప్రత్తిపాడులో మద్యం అమ్ముతున్న వ్యక్తిని గూడెం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసారు. గ్రామాల్లో మద్యం అక్రమంగా అమ్మితే కఠిన చర్యలు తప్పవని సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఈ దాడిలో సబ్ ఇనస్పెక్టర్ మురళి, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా కోడి పందేలు

- మూడురోజుల పాటు కొనసాగిన బరులు
- ఏరులై పారిన మద్యం



తేతలి కోడి పందేల బరిలో ఢీకొంటున్న కోళ్లు

తణుకు అర్బన్: సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించే కోడి పందేలు మూడో రోజు కూడా యథేచ్ఛగా కొనసాగాయి. మూడురోజులపాటు కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహించడంతో కోట్లాది రూపాయిలు చేతులు మారాయి. కోడి పందేలు, జూద క్రీడలతో ప్రజానీకం లక్షలాది రూపాయిలు అప్పులపాలయ్యారు. ముఖ్యంగా అధిక సంఖ్యలో యువత ఈ పందేల్లో పాల్గొని భారీగా డబ్బు నష్టపోయారు. కోడి పందేలు నిర్వహించకూడదని పోలీసులు ఎన్నో రకాలుగా ప్రచారం చేసినప్పటికీ పందేలు జరగకుండా మాత్రం నిరోధించలేకపోయారు. పందేల బరుల్లో మద్యం ఏరులై పారడంతో మందుబాబులు చిందులు వేశారు. అయితే మూడురోజులు నిర్వహించిన కోడి పందేలు నిలిచిపోయాయని పోలీసులు చెబుతున్నప్పటికీ గురువారం కూడా కొనసాగుతాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

భారీగా తరలివచ్చిన వైనం...

ఈ ఏడాది సంక్రాంతి వేడుకల కోసం ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన వారు తమ సొంత గ్రామాలకు అధికసంఖ్యలో తరలివచ్చారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణం, తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో నిర్వహించిన కోడి పందేల బరుల్లో మహిళలు, యువతులు సైతం సందడి చేశారు.

జోరుగా కోడి పందేలు

ఇరగవరం: సంక్రాంతి సందర్భంగా మూడురోజుల పాటు యథేచ్ఛగా కోడి పందేలు కొనసాగాయి. బరుల వద్దే గుండాట, పేకాట, కోతాట తదితర జూద క్రీడలు కొనసాగాయి. ఇరగవరం మండలంలో గోటేరు, కె ఇల్లిందలపర్రు, తూర్పు విప్పర్రు, ఓగిడి, అయినపర్రు, కాకిలేరు, రేలంగి, ఏలేటిపాడు గ్రామాల్లో కోడిపందేలు, గుండాటలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా సంప్రదాయం పేరిట జోరుగా సాగే ఈ జూద క్రీడకు రాష్ట్రంలోని ఇతర జిల్లాలతోపాటు తెలంగాణ నుంచి కూడా పెద్ద సంఖ్యలో జనం వచ్చారు. ముఖ్యంగా ఈసారి పురుషులుతోపాటు మహిళలు కూడా కోడి పందేలు, గుండాట ఆడడానికి ఆసక్తి కనపరిచారు. కోడి పందేలతోపాటు చిన్న పిల్లలకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కోడి పందేలతోపాటు గుండాట, కోతాట, పేకాటలు జోరుగా సాగాయి. కోడి పందేల్లో ఈ మూడు రోజుల్లో కోట్లాది రూపాయిలు చేతులు మారాయి.

బరి తెగించారు

పెంటపాడు: సంక్రాంతి పేరు చెప్పి ఈ ఏడాది పెంటపాడులో చరిత్రలో లేని విధంగా జూదాలు పురివిప్పాయి. కూటమి నేతల కనుసన్నల్లో ఇష్టానుసారం కోడి పందేల మాటున పేకాట, గుండాట, జూదాలు నిర్వహించారు. ప్రతీ సందులో బరి అన్నట్లుగా ఏర్పాటు చేసి యువతను పెడదోవ పట్టించారు. గుండాట బోర్డుల వద్ద మైనర్లు పెద్ద సంఖ్యలో కనిపించడం విశేషం. ఇంత జరుగుతున్నా పోలీసులు కనీసం ప్రేక్షకపాత్ర కూడా పోషించకుండా, ఎక్కడ ఉన్నారో కూడా తెలియదన్నట్టుగా వ్యవహరించారు. పోలీసులు పండుగ ముందు నుంచి హడావుడి చేసినా అసలు సమయం వచ్చే సరికి ఏమీ పట్టనట్టు వదిలేశారు. దీంతో బుధవారం మండలంలోని దర్శిపర్రు, అలంపురం, రాచర్ల, జట్లపాలెం, విప్పర్రు, మీనవిల్లూరు, రామచంద్రపురం గ్రామాల్లో పెద్దపెద్ద బరులు కట్టి ఆటలు నిర్వహించారు. పెంటపాడులో ఎక్కడా కూడా పోలీసు వారి ఆచూకీ కనిపించకపోవడం అటుంచితే రెవెన్యూ అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కోడిపందేల రాయుళ్ల మాటే నెగ్గింది. పందేలకు అనుమతిచ్చేది లేదంటూ పోలీసులు చేసిన ప్రకటనలు చూసి జనం నవ్వుకుంటున్నారు. ఎందుకంటే ప్రతి ఏడాది ఇటువంటి ప్రకటనలు ఇవ్వడం సంక్రాంతి మూడు రోజులు చూసీచూడనట్లు వదిలేయడం అలవాటుగా మారడంతో అటు పందెం రాయుళ్లు, ఇటు నిర్వాహకులు ఎప్పటిలానే పందేలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాల మాటున గుండాటలు, పేకాటలు ఏర్పాటు చేశారు. మద్యం ఏరులై పారింది.



పెంటపాడు: కోడిపందెం బరి వద్ద వాగ్వాదం జరుగుతున్న దృశ్యం



ఇరగవరం: తూర్పువిప్పర్రులో గుండాట ఆడుతున్న దృశ్యం



ఇరగవరం: ఓగిడిలో కోడి పందేలు జరుగుతున్న దృశ్యం

పందేల బరుల వద్ద లేడీ బౌన్సర్లు



తాడేపల్లిగూడెంలో కోడి పందాల బరుల వద్ద లేడీ బౌన్సర్లు

తాడేపల్లిగూడెం: బౌన్సర్లు ఈ మాట వింటే మనకు సెలబ్రిటీలు గుర్తుకు వస్తారు. ఆజానుబాహులు, నల్ల రంగు దుస్తులు ధరించి, సెలబ్రిటీలకు ఇబ్బంది కలుగ చేసేవారిని కట్టడి చేస్తారు. ఇది షరా మామూలే. సంక్రాంతి. పైగా కోడిపందేలు, లోపలికి అనుమతి కావాలంటే పాస్‌లు కావాలి. దుందుడుకుగా లోపలికి ప్రవేశించాలంటే గతంలో నిర్వాహకులు కట్టడి చేసేవారు. పందేలు వేడి హైపిచ్‌కు చేరడంతో బరుల వద్దకు ఔత్సాహికుల తాకిడి భారీగా పెరిగింది. ఆడ, మగా అనే తేడా లేకుండా పందేలను తిలకించడానికి వచ్చినవారిని నిలువరించడానికి తాడేపల్లిగూడెం పట్టణంలోని వెంకట్రామయ్య బరి వద్ద వినూత్నంగా మగ బౌన్సర్లతో పాటు, మహిళా బౌన్సర్లను నియమించారు. సుమారు 23 మంది బౌన్సర్లు ఇక్కడ భద్రతకు వచ్చారు. లేడీ బౌన్సర్లు పందేల దగ్గర ఉండటం ఆసక్తికరంగా మారింది. దీనికి సంబంధించిన విషయం వైరల్ అవుతోంది.

సంప్రదాయ సంక్రాంతి ఉత్సవాలు ఎంతో మేలు



పోలీసులకు దుస్తులు అందజేస్తున్న దాత రాయుడు శ్రీనివాసరావు

పెంటపాడు: సంక్రాంతి పేరిట కోడిపందేలు, గుండాటలకు బదులుగా క్రీడాపోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించడం ఎంతో మేలని గూడెం రూరల్ సీఐ రమేష్, ఎస్ఐ స్వామిలు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ, గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారి జాతల ఉత్సవాలు సందర్భంగా ఉమామహేశ్వరం గ్రామంలో గ్రామానికి చెందిన దాత రాయుడు శ్రీనివాసరావు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీల్లో గ్రామస్తులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నియోజకవర్గ పోలీసు సిబ్బందికి, పేదలకు, వృద్ధులకు రాయుడు శ్రీనివాసరావు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండ్రెడ్డి హైమావతి, మద్దుకూరి రామకృష్ణ, ధనలక్ష్మి, వైష్ణవి, కోడూరి మంగరాజు, కాట్రాజు, పెంటపాటి రత్తయ్యలతో పాటు, పోలీసు సిబ్బంది, పెంట్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామన్నగూడెంలో సంక్రాంతి సంబరాలు



రామన్నగూడెం గ్రామంలో చిన్నారులకు భోగిపళ్లు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోణం యశస్విని ఆధ్వర్యంలో ముగ్గులు పోటీ, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలు నిర్వహించారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి, వేడుక సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు బోణం గణేష్ మాట్లాడుతూ ఇలాంటి వేడుకల ద్వారా గ్రామాల్లో తెలుగు వారి సంప్రదాయాలు భావితరాలకు చేరువవుతాయని, ప్రతీ ఏటా తప్పనిసరిగా సంక్రాంతి సంబరాలు నిర్వహించాలన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మద్దిపాటి సత్యనారాయణ, మద్దిపాటి నాగేశ్వరరావు, బోణం సుబ్బారావు,ముళ్లపూడి వీరాస్వామి, రంగారావు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు మహోత్సవం మంగళవారం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ఆర్టీసీ రోడ్డులోని వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి మేళతాళాలతో అయ్యప్పస్వామి ఆభరణాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పడాల ఆలయంలోని స్వామి వారికి ఆభరణాలను అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు నిమ్మల వెంకటస్వామి, కార్యదర్శి గ్రంధి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సూరపు వెంకటేశ్వరరావు, కోశాధికారి ద్వారంపూడి దేవరాజు రెడ్డి, ఆదూరి వెంకటేశ్వరరావు, పిచ్చికల రాజు, నల్లమిల్లి వెంకటరెడ్డి, తాత జగదీష్, చెంబు సుబ్బారావు, గర్నిపూడి సూరిబాబు, శానం గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు. ఆలయం వద్ద మకరజ్యోతిని భక్తులు దర్శించుకున్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సేవలు అభినందనీయం



పల్లాలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

అత్తిలి: గ్రామదేవత పల్లాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు అందజేస్తున్న సహాయ సహకారాలు మరువరానివని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం అత్తిలి మండలం కొమ్మరలో మెయిన్‌రోడ్డు నుంచి చేలల్లో ఉన్న గ్రామదేవత పల్లాలమ్మ అమ్మవారి ఆలయం వరకు నిర్మించే రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ భూమిపూజ చేసారు. గ్రామానికి చెందిన కోసూరి రామలింగరాజు జన్మనిచ్చిన తల్లిదండ్రులపై గౌరవం, జన్మభూమిపై మమకారంతో గ్రామ దేవత శ్రీపల్లాలమ్మ దేవాలయానికి వెళ్లడానికి భక్తుల సౌకర్యార్థం తన సొంత నిధులు రూ. 20లక్షలతో రోడ్డు ఏర్పాటుకు భూమిని సేకరించి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రామ ప్రజల చిరకాల కోరికైన అమ్మవారి ఆలయం వరకు రోడ్డు నిర్మాణం గ్రామస్తుల ఐకమత్యంతో, దాత కోసూరి రామలింగరాజు ముందుకు వచ్చి ఈబృహత్తర కార్యక్రమానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు, మండలపార్టీ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు పోలిశెట్టి చంటి, దాసం బాబ్జి, అల్లి సత్యనారాయణ, ఉపసర్పంచ్ మన్యందానారావు, గ్రామ ప్రముఖులు పెన్మెత్స పుల్లంరాజు, యలమంచిలి త్రిమూర్తులు, మంతెన పెద్దిరాజు, శేఖర్, ఇవ్వంది వెంకట సత్యనారాయణ, పోలిశెట్టి చందు, బోడపాటి సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో దాడులు నిర్వహించి, కోడిపందెంగాళ్లను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని పడాల గ్రామంలో ఇరువురు కోడిపందెగాళ్లను అదుపులోకి తీసుకొని, రూ.1070లు, కోడిపుంజు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పెదతాడేపల్లి గ్రామ శివారులో గుండాట ఆడుతున్న ఇరువురిని అదుపులోకి తీసుకొని, రూ.1250లు నగదు, గుండాట ఫ్లెక్సీని సీజ్ చేశారు. కొమ్ముగూడెంలో ఇరువురు కోడిపందెం రాయుళ్లు, రూ.1320లు నగదు, ఒక కోడిపుంజు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. పెదతాడేపల్లిలో కోతబంతి (పేకాట) ఆడుతున్న ఇరువురితో పాటు రూ.1150లు నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. బంగారుగూడెంలో ఇరువురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1220లు నగదు, ఒక కోడి పుంజు, రెండు కోడికత్తులను సీజ్ చేశారు. వీరంపాలెంలో ఇరువురిని అదుపులోకి తీసుకొని రూ.1400లు నగదు, ఒక కోడిపుంజు, ఒక కోడికత్తిని స్వాధీనం చేసుకున్నారు. లింగారాయుడిగూడెంలో ఇరువురు పందెగాళ్లను రూ.1600లు నగదు, రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులను సీజ్ చేశారు. కుంచనపల్లిలో ఇరువురిని అదుపులోకి తీసుకొని రూ.వెయ్యి నగదు, ఫ్లెక్సీ, డైస్‌లు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముగిసిన అమ్మవార్ల ఉత్సవాలు

పెంటపాడు: మండలం జట్లపాలెం గ్రామ దేవత పొరుపల్లి అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఆలయ ఉత్సవకమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని కనుమ సందర్భంగా ఘనంగా ఊరేగించారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి

యలమంచిలి: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే నిజమైన దైవసేవని బీసీ సంక్షేమ సంఘం పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షుడు పొన్నమండ ముత్యాలరావు చెప్పారు. వడ్డిలంక గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కామన మారియ్య, నాగమణి, కామన నాగేశ్వరరావు, దుర్గాభవాని కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ప్రమాద విషయం తెలుసుకున్న అగాపే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పమ్మి లాజరు అగ్నిప్రమాద బాధితులకు రెండేసి జతల చొప్పున రగ్గులు, దుప్పట్లను పంపిణీ చేశారు.

బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): సంక్రాంతి పండుగ సాంప్రదాయాన్ని, సంస్కృతిని కాపాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ, ఎస్.ఎఫ్.ఐ, సీఐటీయూ, మహిళా సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక భాగ్యలక్ష్మీపేటలోని 19వ వార్డులో మహిళలకు ముగ్గులు పోటీలు , పిల్లలకు స్లోసైకిల్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ యువత చెడు మార్గాలైన పేకాట, జూదం, కోడి పందేలు, అశ్లీల చిత్రాలు వైపు మళ్లకుండా సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని పిలుపునిచ్చారు. పుట్టా వేణుగోపాల్ చౌదరి, పత్తి వీరాస్వామి, శేషుబాబు, పోతు శ్రీనివాస్, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుంతలో ముసలమ్మ అమ్మవారి గ్రామోత్సవం



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

అత్తిలి: సంక్రాంతి సందర్భంగా అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో పుంతలో ముసలమ్మ అమ్మవారి ఊరేగింపు ఉత్సవం బుధవారం వైభవంగా జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి చిత్రపటాన్ని ఉంచి మేళతాళాలు, ఆసాదుల గరగనృత్యాలతో జారత ఉత్సవాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించి ప్రసాదాలను స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం



పెంటపాడు ఎస్వీఎన్ హైస్కూల్లో 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పెంటపాడు: పెంటపాడు ఎస్వీఎన్ హిందూ హైస్కూల్ 2000–01 సంవత్సరంలో పదోతరగతి అభ్యసించిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని...నాటి మధుర స్మృతులను స్మరించుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పెంటపాడు, బోడపాడు, దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల, జట్లపాలెం, ముదునూరుపాడు గ్రామాలకు చెందిన తాము చదువుకొన్న స్కూల్‌ను పరిశీలించారు. సంక్రాంతి పురస్కరించుకొని అప్పటి గురువులైన శారద, రాజేశ్వరి, ప్రభాకరశాస్త్రి, హెచ్‌ఎం రాఘవాచార్యులు, శ్రీరామచంద్రమూర్తి, శ్రీదేవి, పీఈటీ కన్నారెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు. సాయంత్రం వరకు పాఠశాల ఆవరణలో ఉత్సాహంగా గడిపారు. ఇకపై తరుచూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం జరిగేందుకు కృషి చేసిన తోట అప్పారావు, బేతు మోహన్, కొనకళ్ల కిషోర్, చిగురుపాటి కిషోర్, జీవీ రమేష్, సంధ్య, అర్చన, సుహాసిని, జ్యోతిలను ప్రత్యేకంగా అభినందించారు.

అపూర్వ కలయిక



ఉండి గోరింతోటలో కలిసిన 1978-79 బ్యాచ్ విద్యార్థులు

ఉండి: ఆకివీడు మండలం చినకాపవరం జెడ్పీ హైస్కూల్లో 1978–79 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఉండి గోరింతోటలో సమావేశమయ్యారు. వారి సౌలభ్యతను బట్టి గోరింతోటలో నిర్వహించిన ఈ సమ్మేళనంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొని తమ తీపిగుర్తులను నెమరవేసుకున్నారు. విద్యార్థి దశలో తమ అనుభవాలను గుర్తు చేసుకుని సంతోషాలను పంచుకున్నారు.అలాగే వారి వారి పరిచయాల అనంతరం విందు భోజనాన్ని చేసి తమ స్వస్థలాలకు చేరుకున్నారు.కఠారి వెంకటకృష్ణ, వైఎస్ కళాశాల లెక్చరర్ కేఎస్ఎన్ రంగరావు, సీనియర్ జర్నలిస్టు కట్రెడ్డి రామకృష్ణ, కె.ప్రసాద్, కె.పేటుమల్లు, ఎస్.మోహన్‌రంగారావు, దండు గోపాలకృష్ణంరాజు, క్షీరసాగర్, వెంకట్రాజు, మంచాల సత్యనారాయణ, నాగేశ్వరరావు, మల్లికార్జున, సుధాకర్ పాల్గొన్నారు.

కృష్ణ యోగ ధ్యాన మందిరంలో విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణయోగ ధ్యాన మందిరంలో బుధవారం కనుమ పురస్కరించుకొని విశేష పూజలు జరిగాయి. జిల్లా హిందూ, ధర్మ ప్రచార పరిషత్ వారి సంయుక్త ఆధ్వర్యంలో గో విశిష్టతపై ప్రవచనాలు జరిగాయి. భక్తులు గో పూజ నిర్వహించారు.